మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎలమోని స్వప్న కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎంఈవో హీర్యా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్న నేపథ్యంలో ఆ రోజు పాఠశాలల్లో వంట చేయమని స్పష్టం చేశారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, వారానికి మూడు రోజులు ఇచ్చే గుడ్లతోపాటు వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అలాగే కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సిడె కార్యక్రమంలో కిక్కిరిసిన భక్తజనం



సిడెపై ఎల్లమ్మ తల్లి

అమ్మకు మొక్కు

భక్తజనం పరవశించి

మినీ మేడారంగా గుర్తింపు పొందిన పోలెపల్లి ఎల్లమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పోలెపల్లిలో అమ్మవారి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిడె కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ తంతుకు స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన హైదరాబాద్ నుంచి నేరుగా హెలీకాప్టర్‌లో ఆలయానికి చేరుకొని పలువురు మంత్రులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

- అలరించిన అమ్మవారి సిడె కార్యక్రమం
- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మంత్రులతో కలిసి పట్టు వస్త్రాల సమర్పణ
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు
- బోనాలతో అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

6



ఎల్లమ్మ తల్లికి మొక్కుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, జూపల్లి, దామోదర

వైభవంగా పోలెపల్లి ఎల్లమ్మ జాతర

దుద్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన సిడె కార్యక్రమానికి శుక్రవారం ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారి దర్శనం కోసం బారులుదీరారు. పిండివంటలు, మట్టి కుండల్లో నైవేద్యం తయారు చేసి అలంకరించిన బోనం కుండను తలపై పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. డప్పు చప్పుళ్ల మధ్య మేకలు, కోళ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కల్లు సాకతో మొక్కులను చెల్లించుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్నందున అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది తప్పిపోయిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎల్లమ్మ తల్లిని

మిగతా 7వ పేజీలో...

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిడె కార్యక్రమంలో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం 5 గంటలకు జల్డి బిందెతో దగ్గర్లోని బావి దగ్గరికి వెళ్లి నీళ్లు తీసుకొని 6 గంటలకు ఆలయానికి వచ్చారు. అనంతరం సిడె రథానికి ఏర్పాటు చేసిన పైపు చివరన తొట్టెల్లో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి డప్పుల దరువు, శివసత్తుల పూనకాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆ సమయంలో భక్తులు అమ్మవారిపై పసుపు, కుంకుమ, గవ్వలతో బండారిని చల్లారు. 'ఎల్లమ్మ తల్లీ మమ్ము ఏలుకోవమ్మా' అంటూ ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. జాతరకు చిన్న, పెద్ద తేడా లేకుండా వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రంగురాట్నాలు, ఆట వస్తువులు, మిఠాయి దుకాణాల దగ్గర సందడి నెలకొంది.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

తలకొండపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్య చికిత్సలకు రూ.10 లక్షలు అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 1.60 లక్షల చెక్కులను శుక్రవారం వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, నాయకులు రమేశ్, రామ్మోహన్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, నర్సింహ్మా, మల్లేశ్, యాదగిరి, సురేశ్, గణేశ్, శ్రీను పాల్గొన్నారు.

స్నేహితురాలు మాట్లాడటం లేదని..

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

షాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : స్నేహితురాలు తనతో మాట్లాడటం లేదని పదవ తరగతి విద్యార్థిని స్పిరిట్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన షాబాద్ మండల కేంద్రంలోని శుక్రవారం చోటుచేసుకుంది. షాబాద్‌లో కొనసాగుతున్న ఆమనగల్ గురుకుల పాఠశాలలో టెన్త్ క్లాస్ చదువుతున్న శ్రీజ తన స్నేహితురాలు మాట్లాడడం లేదని మనస్తాపంతో శుక్రవారం ఉదయం స్పిరిట్ తాగింది. ఇది గమనించిన ఉపాధ్యాయురాలు ఆమెను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి అక్కడ చికిత్స పొందుతుంది. శ్రీజ పరిస్థితి నిలకడగా ఉందని ప్రిన్సిపాల్ వినోల తెలిపారు. గురుకుల పాఠశాలను షాబాద్ వైద్యాధికారి విజయలక్ష్మి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి సందర్శించి.. ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



జాతీయ స్థాయి క్రీడలకు కొండాకల్ విద్యార్థి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కొండాకల్ గ్రామానికి చెందిన వరుణ్‌గౌడ్ బాసర ట్రిపుల్ ఐటీలో మొదటి సంవత్సరం చదువుతూ జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. నగరంలోని ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 18, 19న జరిగిన రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్ పోటీలలో డిస్కస్, షార్ట్‌పుట్‌లలో ప్రతిభ కనబరిచి అధ్యక్షుడు స్టాన్లీ జాన్స్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. మార్చి 20న పాట్నాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వరుణ్ గౌడ్ పాల్గొననున్నాడు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికకావడంపై ఆయన తల్లిదండ్రులు కల్పన లక్ష్మణ్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

రూ.38 కోట్లు

- రంగారెడ్డి జోన్‌లో విద్యుత్ బకాయిలు
- వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

6

హార్స్ రైడింగ్‌కు రెడీ

నేటి నుంచి శంకర్‌పల్లిలో జాతీయస్థాయి అర్హత పోటీలు

ముస్తాబైన జన్వాడలోని నాసర్ పోలో.. పోటీలను తిలకించేందుకు ఉచిత ప్రవేశం



శంకర్‌పల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): గుర్రపు స్వారీ పోటీల నిర్వహణకు శంకర్‌పల్లి మండలం జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ ముస్తాబైంది. జూనియర్ నేషనల్ ఈక్వేస్ట్రియన్ చాంపియన్ షిప్-2025 పోటీలు శనివారం నుంచి రెండు రోజుల పాటు (22, 23 తేదీలలో) జరుగనున్నాయి. ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ అర్హత పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశంలో గుర్తింపు పొందిన హార్స్ రైడింగ్ క్లబ్‌ల నుంచి అండర్-11, అండర్-14, అండర్-18 కేటగిరీలలో ఉన్న హార్స్ రైడర్స్ ఇందులో పాల్గొననున్నారు. ఒక్కో రైడర్ ఒక్కసారి మాత్రమే పోటీ పడేందుకు అవకాశం ఉంది. అర్హత పోటీలలో గెలుపొందిన విజేతలు ఢిల్లీలో నిర్వహించే చాంపియన్ షిప్-2025 ఫైనల్స్ పోటీలలో పాల్గొననున్నారు. ఈక్వేస్ట్రియన్‌లో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. అందులో పోలో, షో జంపింగ్, డ్రెసాజ్ ముఖ్యమైనవి. ఈ పోటీలకు చూసేందుకు వచ్చే వారికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

1988లో నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ ఏర్పాటు

నిజాం కుటుంబానికి చెందిన మీర్ అహ్మద్ గుర్రాల పోటీలపై మక్కువతో నగర సమీపంలోని జన్వాడలో నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఏడెకరాల విస్తీర్ణంలో

మిగతా 8వ పేజీలో...

జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం గర్వంగా ఉంది



ఎంతో ప్రతిష్ఠాత్మకమైన హార్స్ రైడింగ్ చాంపియన్ షిప్-2025 అర్హత పోటీలు నాసర్‌పోలో క్లబ్‌లో నిర్వహించడం గర్వంగా ఉంది. ఈక్వేస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ వారు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన క్లబ్‌లో పోటీలు నిర్వహించాలని నిర్ణయించడంతో తమకు ఈ అవకాశం లభించింది. పోటీల నిర్వహణకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- మీర్ అహ్మద్, సీఈవో, నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్, జన్వాడ

ఆరుతడి పంటలు లాభదాయకం

- ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి సురేశ్



డ్రిప్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న సురేశ్

కడ్తాల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తక్కువ నీరు, స్వల్ప పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఉద్యాన, ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి సురేశ్ అన్నారు. ఆరుతడి పంటల సాగు లాభదాయకమని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం పడకల్, కడ్తాల మండలంలోని వివిధ గ్రామాలలో ఆయన పర్యటించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని, అలాగే ఈ పంట ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. మొక్కలకు 90 శాతం సబ్సిడీ, డ్రిప్‌కు ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 80 శాతం, నాలుగేళ్ల నిర్వహణకు రూ.4200 అందిస్తుందని చెప్పారు. ఈ పంట దిగుబడి నాలుగేళ్ల నుంచి ప్రారంభమై 35 సంవత్సరాల వరకు వస్తుందని వివరించారు. అలాగే చీడపీడల బాధ కూడా ఉండదని తెలిపారు. ఎకరాకు 8 నుంచి 12 టన్నులు దిగుబడి వస్తుందని సురేశ్ తెలిపారు. డ్రిప్‌సిస్టమ్‌తో తక్కువ నీటితో ఎక్కువ ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి సౌమ్య, ఫీల్డ్ ఆఫీసర్ రుక్మిణి, కొండల్ పాల్గొన్నారు.

- నిందితుడు వీరరాఘవరెడ్డిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- కీలక విషయాలు వెలుగులోకి..
- పూర్తి నివేదిక కోర్టులో అందజేత

రంగరాజన్‌పై దాడి కేసు..

విచారణ పూర్తి

మొయినాబాద్: ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి) : మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడైన వీరరాఘవరెడ్డిని మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకొని పోలీసులు విచారించారు. శుక్రవారం కస్టడీ ముగియడంతో రాజేంద్రనగర్ కోర్టులో నిందితుడిని హాజరుపర్చారు. విచారణ సమయంలో వీరరాఘవరెడ్డి నుంచి పలు కీలక విషయాలు పోలీసులు రాబట్టారు. రామరాజ్యం స్థాపనతో పాటు దాడికి సంబంధించిన అన్ని విషయాలు తెలిపాడు. తెలుగు రాష్ట్రాల్లోని ఆరు ప్రధాన ఆలయాలకు వెళ్లినట్లు విచారణలో తెలిసింది. రామరాజ్యం స్థాపనకోసం డబ్బులు కూడా వసూలు చేసినట్లు గుర్తించారు. వీరరాఘవరెడ్డికి రెండు బ్యాంకు ఖాతాలున్నాయని, అందులో రూ.20వేలు ఉన్నట్లు పోలీసులతో నిందితుడు చెప్పాడు. అతని ఖాతాల స్టేట్‌మెంట్ కోసం మొయినాబాద్ పోలీసులు బ్యాంక్ అధికారులకు లేఖ రాశారు. రామరాజ్యం స్థాపన కోసం ఫండ్స్ ఇవ్వాలని కొంతమందిపై వత్తిడి చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే ఎవరెవరు ఎంత ఇచ్చారు అనేది బ్యాంకు స్టేట్‌మెంట్‌లు వస్తే తెలుస్తుంది. కాగా పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు వీరరాఘవరెడ్డి తనదైన స్టైల్‌లోనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. శ్లోకాలు చెబుతూ పద్యాలు పాడుతూ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటి వరకు 20 మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రపంచం గుర్తించాలని..

ప్రపంచం తనను గుర్తించాలన్నదే వీరరాఘవరెడ్డి ప్రధాన లక్ష్యం. ఇందుకోసం అనేక ప్రణాళికలు రూపొందించాడు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలు సరిగ్గాలేవని భావించి అతనే ఓ వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి తానే సుప్రీం అవ్వాలనుకున్నాడు. అందుకోసం రామరాజ్యం సంస్థను ఏర్పాటు చేశాడు. దీనికి సంబంధించి ఓ వెబ్‌సైట్ ఏర్పాటు చేశాడు. తనతో పాటు ఓ సైన్యం ఉండాలని తెలుగు రాష్ట్రాల్లోని వారు రామరాజ్యంలో చేరాలని పిలుపునిచ్చాడు. ఆకర్షితులైన కొందరు సభ్యులుగా చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో 25 మందిని ఎంపిక చేసుకున్నాడు. వారికి జీతంతో పాటు మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. హిందూ ధర్మపరిరక్షణ పేరుతో కార్యకలాపాలు మొదలు పెట్టాడు. అతను అనుకున్న కార్యక్రమాలు ముందుకు సాగాలంటే నిధులు అవసరమని భావించి ఆలయాల అర్చకులను టార్గెట్ చేశాడు. విచారణ సమయంలో మూడు రోజుల పాటు నిందితుడి నుంచి తెలుసుకున్న విషయాల నివేదికను పోలీసులు కోర్టులో సమర్పించారు.

ఉత్తమ పరిశోధనలు చేయాలి

శామీర్‌పేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు శ్రద్ధ వహించి పీహెచ్‌డీలో ఉత్తమ పరిశోధనలు చేసి అత్యున్నత శిఖరాలకు ఎదగాలని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ హితవు అన్నారు. శామీర్‌పేటలోని జగద్గిరిగుట్ట గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో రసాయనశాస్త్రం అధ్యాపకురాలుగా పనిచేస్తున్న అనితకు ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్‌ను సాధించారు. ఆమె ఓయూ రసాయనశాస్త్రంలో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మంజరి సునీత పర్యవేక్షణలో 'ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్ అండ్ స్టెబిలిటీ ఇండికేటింగ్ మెథడ్ డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ సెలక్టెడ్ డ్రగ్స్ బై ఆర్‌పీ-హెచ్‌పీఎల్‌సీ అండ్ యూపీఎల్‌సీ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో అనిత ఉత్తమ ఫలితాలను సాధించి డాక్టరేట్ పొందింది. ఈ సందర్భంగా శుక్రవారం శామీర్‌పేటలోని ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల్లో అధ్యాపకురాలు అనితను సన్మానించారు. భవిష్యత్‌లో మరెన్నో పరిశోధనలు చేసి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపాల్ ఇష్రత్ హితవు పలికారు


అనితను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, అధ్యాపకులు

ఉపాధి కల్పనకు కృషి చేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అశోక్‌చంద్రను నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అశోక్‌చంద్రను కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఉపాధి కల్పనకు బ్యాంక్ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కోరారు. చిన్న పరిశ్రమల స్థాపనకు యువతకు తోడ్పాటునందించాలన్నారు. దీనికి అశోక్‌చంద్ర సానుకూలంగా స్పందించినట్లు మల్లు రవి తెలిపారు.

మాతృభాషను మరవొద్దు

పెద్దేముల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవితంలో మనకు అవసరమైన భాషలు ఎన్ని నేర్చుకున్నా తల్లితో సమానమైన మాతృభాషను ఎన్నటికీ మరవకూడదని ప్రముఖకవి గంటామనోహర్‌రెడ్డి అన్నారు. కందనెల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం శెట్టి శివకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం వడిచర్ల సత్యం రచించిన మణిపూసలను వందకుపైగా కంఠస్థంచేసిన ఆరో తరగతి విద్యార్థులు ఈదులపల్లి మహేష్,సత్కరించిఅభినందించారు.అంతకు ముందు నిర్వహించిన పాటలు, పద్యాలు, ఉక్తలేఖనం, వక్తృత్వం పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వడిచర్లసత్యం, టి.పద్మలను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, శోభారాణి, కె.అనురాధ, ప్రవీణ్‌జాదవ్, జరీనా, రాధాకృష్ణ, సంతోష్‌కుమార్, బస్వరాజ్, రమాదేవి, సీతాలావణ్య, స్వప్న, రాఘవేందర్, నర్సింహులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

రూ.38 కోట్లు విద్యుత్ బకాయిలు

● రంగారెడ్డి జోన్‌లో వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ డిస్కం అధికారులు మొండి విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టిసారించారు. రంగారెడి జోన్‌లో పాత బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి బిల్లులు వసూలచేస్తునట్లు రంగారెడ్డి జోన్‌చీఫ్ ఇంజనీర్ (సీఈ) పాండ్య తెలిపారు. 6నెలలుగా రంగారెడ్డి జోన్‌పరిధిలోని నాలుగు సర్కిళ్లలో రూ.38 కోట్లు బాకాయిలు పేరుకుపోయినట్లు తెలిపారు. అత్యధికంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లో రూ.22.58 కోట్లు, సైబర్‌సిటీ రూ.7.70కోట్లు, సరూర్‌నగర్‌లో రూ.2.55 కోట్లు, అలాగే వికారాబాద్‌లో రూ.5,45 కోట్లు పేరుకుపోయాయి.శుక్రవారం అల్లాపూర్ సెక్షన్‌లో రూ.50 వేలకు పైన బాకాయిలు ఉన్న సర్వీసులు పరిశీలించడంతో పలు కనెక్షన్లు తొలగించడంతో రూ. 5 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జోన్‌పరిధిలోని సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్‌లో వారంరోజుల పాటు మొండిబకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తునట్లు తెలిపారు. సర్కిళ్లలో వినియోగదారులు పాత బకాయిలు సకాలంలో చెల్లించాలని సీఈ కోరారు. డ్రైవ్‌లో జీఎం అంజయ్య, డీఈ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ నిర్మాణానికి అడుగులు

తాండూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నాలుగు లైన్ల రైల్వే ట్రాక్ నిర్మాణానికి సంబంధించి దక్షణ మధ్య రైల్వే శాఖ అడుగులు వేసింది. హైదరాబాద్-ముంబై మార్గంలో 173 కిలోమీటర్ల డ్యూయల్‌ట్రాక్ సెక్షన్‌ను ఏర్పాటు చేసే నివేదికను ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ)కి దక్షిణమధ్య రైల్వే పంపినట్లు సమాచారం. ప్రస్తుతం రెండు లైన్లు ఉన్న రైల్వేలైన్ నాలుగు లైన్లకు అప్‌గ్రేడ్ చేయనున్నారు. సికింద్రాబాద్ - వాడీ మధ్యన ప్రస్తుతం రెండు లైన్‌లతో రైళ్ల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రయాణికులు సకాలంలో చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన రైల్వేశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ నుంచి తాండూరు మీదుగా కర్ణాటకరాష్ట్రం వాడీజంక్షన్‌వరకు ఈ ట్రాక్ లింకును కలుపుతారు. ఈట్రాక్ అభివృద్ధికి రూ.4.445కోట్లు ప్రతిపాదించారు. ప్రస్తుతం సికింద్రాబాద్-వాడీ మార్గంలో నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దీ కారణంగా సగటు 60కి.మీ వేగంతో మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణికులకు సాఫీగావెళ్లేందుకు ఈ నాలుగు లైన్లట్రాక్ అమలైతే ఇబ్బందులు తొలగుతాయి. అంతేకాకుండా సిమెంట్ ఫ్యాక్టరీలు థర్మల్‌పవర్ స్టేషన్‌లకు ఉపయోగపడుతుంది. రైల్వే మంత్రిత్వ శాఖ చేపట్టిన సర్వే కూడా తుదిదశకు చేరుకుంది. ఈప్రాజెక్టుకు అవసరమైన 226ఎకరాల భూమిని గుర్తించారు. తాండూరు, కర్ణాటక రాష్ట్రం సేడం ప్రాంతంలో విస్తరించిన సిమెంటు ఉత్పత్తులు రవాణా చేసేందుకు గూడ్స్ రైళ్లు ప్రత్యేకంగా ఒక ట్రాక్ ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. దీంతో మిగతా రైళ్లు సాఫీగా ఎక్కడా ఆగకుండా వెళ్లేందుకు ఆస్కారం ఉంటుంది.


ప్రస్తుతం రెండు వరుసలున్న రైల్వే ట్రాక్

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- ముస్తాబవుతున్న శైవ క్షేత్రాలు
- మైసిగండి శివరామాలయంలో ఏర్పాట్లు పూర్తి
- 25 నుంచి వేడుకలు ప్రారంభం
- 26న శివపార్వతుల కల్యాణం, రథోత్సవం

కడ్తాల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కడ్తాల మైసిగండి శివరామాలయం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం మైసిగండి శివరామాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాక హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, నల్గొండ, మెదక్, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్ నగర్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

భారీ ఏర్పాట్లు

మైసిగండి శివాలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే శివరాత్రి కాశీ విశ్వనాథ స్వామి బ్రహ్మోత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు ,దేవాదాయ శాఖ అధికారులు వసతులు కల్పించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం ముందు



చలువ పందిళ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా అలంకరిస్తున్నారు. దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ నుంచి మైసిగండికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

మైసిగండి శివాలయంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఫౌండర్, ట్రస్టీ రామావత్ సిరోలి, ఈఓ స్నేహలత వివరించారు. 25న విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, స్వామి వారిని మహన్యాసకపూర్వ రుద్రాభిషేకం, 26న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో శివపార్వతుల కల్యాణం, రథోత్సవం, 27న వసంతోత్సవం, అవబృతం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మూడు రోజుల పాటు రుద్రహోమం, నవగ్రహ హోమం, గణపతి హోమం నిర్వహిస్తామని చెప్పారు. సమయానుకూలంగా ధార్మిక కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

రామలింగేశ్వర ఆలయం ముస్తాబు

- నేటి నుంచి ప్రత్యేక పూజలు

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 22న గణపతి పూజ, రుద్ర హోమం, ధ్వజా రోహణం, 23న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు, 24న రుద్రాభిషేకం, నంది సేవా, అగ్ని గుండాలు, 25న ద్వాదశి, రుద్రాభిషేకం, 26న



మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తారు. 27న రుద్ర హోమం, పూర్ణాహుతి, 28న పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం ఉంటుంది. మార్చి2న శివ తీర్థం, ప్రసాదాలు ఉంటాయి.

త్రిపురాంతకేశ్వర ఆలయంలో ఏర్పాట్లు

- 24 నుంచి బ్రహ్మోత్సవాలు
- ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు రాంనుంతల గ్రామ సమీపంలోని అయ్యసాగర క్షేత్రంలో వెలసిన త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, భద్రకాళి, సరస్వతి, శ్రీరామాంజనేయ ఆలయాలు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈనెల 24 నుంచి మార్చి 2వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. 27వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకలకు హైదరాబాద్ నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. ఏడు రోజులపాటు శివ కోటి జప యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తుల కోసం చలువ పందిళ్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నారు.



అయ్యసాగర్ శివాలయం

ప్రత్యేక పూజల వివరాలు

అయ్యసాగర్‌లో 24 నుంచి మార్చి 2వ తేది వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ నిర్వాహకులు కరుణాకర్ రెడ్డి, ఆలయ వికాస సంఘం అధ్యక్షుడు భట్టు నర్సిరెడ్డి, కార్యదర్శి పంచాక్షరి తెలిపారు. 24న విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, సర్వదేతాపూజలు, పతాకావిష్కరణ, భగద్గీత పారాయణం, దేవ యజ్ఞం, మహాత్ముల ప్రవచనాలు, భజనలు, 25న శివకోటి యజ్ఞం, పూర్ణాహుతి, శివగీత, భగవద్గీత, పారాయణ, ప్రవచనాలు, 26న మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, 27న అగ్నిగుండం, నందికోత్సవ సేవ, 28న భజనలు, చిన్నతేరు, నందీశ్వర సేవ, మార్చి 1న పెద్ద తేరు, 2న చక్రతీర్థం, అమృత స్నానం, రుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలుంటాయని తెలిపారు. కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు రామరెడ్డి, వీరయ్య, యాదయ్య, యాదగిరి రెడ్డి, శ్రీనునాయక్, సరిత పంతూనాయక్, వైద్యనాథ్, చంద్రశేఖరరెడ్డి కోరారు.



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న నర్సింగ్ అధికారులు

నర్సింగ్ అధికారులకు అవార్డులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నర్సింగ్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎస్ సుచేత, మేరిరత్న జ్యోతికి ఉత్తమ పురస్కారాలు వరించాయి. ఉత్తమ సేవలకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశానుసారం శుక్రవారం డీసీహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వారు రోగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మల్లంపాటి ఫౌండర్, టెక్ సీఈవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని మల్లంపాటి ఫౌండర్, టెక్ సీఈఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఐఈటీ కళాశాలలో రెండు రోజులపాటు జరగనున్న హాక్‌థాన్ అనే పేరుతో విద్యార్థులకు నిర్వహించనున్న కాంపిటీషన్‌పై అవగహన శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కృత్రిమ మేథస్సుపై జరిగే వివిధ రకాల కాంపిటీషన్లలో విద్యార్థులు విద్యార్థులు పాల్గొని అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణామాచారి మాట్లాడుతూ 250 మంది విద్యార్థులకు ఈ కర్యక్రమంలో అవకాశం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేబీఎస్ విద్యాసంస్థల సంచాలకులు డాక్టర్ సీహెచ్ సంజయ్, డీన్ సీఎస్ డాక్టర్ వెంకటకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టరు రమేష్, డాక్టర్ నర్సప్ప రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమ్మకు మొక్కి

(ఐదో పేజీ తరువాయి)

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. కొడంగల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉంటూ పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నట్లు ఆయన విలేకరులతో తెలిపారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సీఎం పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు

జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరైనందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు లగచర్ల, హకీంపేట్ తండాకు చెందిన పలువురిని శుక్రవారం ఉదయం 5 గంటలకు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం వారిని కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో రాజునాయక్, యాదయ్య, శివకుమార్, మాజీ సర్పంచ్ బసప్ప తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ నుంచి అర్చకులను పిలిపించి పూజలు

ఎల్లమ్మ ఉత్సవాలకు స్థానిక రాజకీయ నాయకులు దాదాపు 10 సంవత్సరాలుగా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు మఠం మహేశ్ స్వామిని కాదని (అర్చకుడి తప్పిదం ఏమీ లేకున్నా) హైదరాబాద్ నుంచి అర్చకులను పిలిపించి పూజలు నిర్వహించినట్లు మహేశ్ స్వామి ఆరోపించారు. ఆలయాల్లో రాజకీయం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అర్చకుడి కార్య నిర్వాహణ అధికారి కార్యాలయంలో కూర్చోబెట్టడాన్ని స్థానిక పురోహిత అర్చకులను అవమాన పర్చడమేనని పురోహిత సంక్షేమ సంఘం ప్రతినిధులు నటరాజ్, మఠం రాజశేఖర్, వీరేశలింగం అన్నారు.



ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందోహం

రుణమాఫీ చేయాలని సీఎంకు వినతి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎదులాబాద్ సింగిల్‌విండో డైరెక్టర్ కె.ఉదయ్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. నగరంలోని సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని జాతీయ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన ఘట్‌కేసర్ రైతుసేవా సహకార బ్యాంక్‌లో రుణం తీసుకున్న 1189 మందికి మాఫీ కాలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రుణమాఫీ కాదేమోనని మండల రైతులు ఆందోళన చెందుతున్నారని సీఎంకు వివరించారు. ఎవరూ అధైర్యపడొద్దని రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ అవుతుందని సీఎం భరోసా ఇచ్చినట్లు తెలిపారు. చిన్నచిన్న తప్పిదాలతో ఘట్‌కేసర్ మండల రైతులకు రుణమాఫీ కాలేదని, ఇప్పుడు మాఫీ జరుగుతుందని హామీ ఇచ్చినట్లు ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమి పూజలో పాల్గొని ఆయన మాట్లాడారు. పేదవారికి రూ.5 లక్షలతో, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలతో డబుల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతగా ప్రతీ మండలంలో ఓ గ్రామానికి పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ఇళ్లు మంజూర్ చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకతోపాటు స్టీల్, సిమెంట్ లాంటి వాటిని తక్కువ ధరలకు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితమా?

- 2023లో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ
- ఇప్పటికీ పనులు ప్రారంభం కాని వైనం
- ఇబ్బందులు పడుతున్న మహిళా సభ్యులు

కడ్తాల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవన నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. భవన నిర్మాణం విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. 2016లో కడ్తాలను పాలనా సౌలభ్యం కోసం మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఐకేపీ కార్యాలయాన్ని భవనంలేని కారణంగా రచ్చబండ వద్ద ఓ పాత భవనంలో ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు సమావేశాల నిర్వాహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.20 లక్షలు కేటాయింపు

మండల మహిళా సమైఖ్య కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని ఏళ్లుగా మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో గతేడాది భవన నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా రూ.20 లక్షలు కేటాయించింది.



శంకుస్థాపనకు వేసిన శిలాఫలకం

ఆంధ్రబ్యాంక్ సమీపంలోని ఓ వెంచర్‌లో భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. 2023 సెప్టెంబర్ 8న అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభానికి అధికారులు చర్యలు చేపడుతుండగా వెంచర్‌లోని ప్లాట్ల కొనుగోలుదారులు, నివాసులు వెంచర్‌లో రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మాణం చేసిన తర్వాతే భవనం నిర్మించాలని అభ్యంతరం తెలిపారు. దీంతో పనుల్లో జాప్యం జరగడం.. ఆ తర్వాత, అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడం తో భవన నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకొని మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణం చేపట్టాలని మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న సీజీఆర్‌ఫౌండర్ లక్ష్మారెడ్డి

ప్రకృతిని భావితరాలకు అందించాలి

- సీజీఆర్ ఫౌండర్ కొర్పోలు లక్ష్మారెడ్డి

ఆమనగల్లు , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పుడమిని, ప్రకృతిని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్పోలు లక్ష్మారెడ్డి అన్నారు. సహజ సిద్ధమైన వనరులను కాపాడడం ప్రతిపౌరుడు సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి దిఎర్త్ సెంటర్‌లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి లక్ష్మారెడ్డి హాజరై ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం ఆవశ్యకత, నీటి నిల్వల పెంపు, తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ప్రకృతిని విస్మరిస్తే జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సీజీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సీజీఆర్ ప్రతినిధి జ్ఞానేశ్వర్ అడవుల రకాలు, విత్తన బంతుల తయారీ, బయో ఎంజైమ్ గురించి విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ చేస్తున్న కృషిని షాబాద్ మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర ప్రశంసించారు. కార్యక్రమంలో నగేశ్, సీజీఆర్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

- జాతీయ రహదారిపై అడ్డగోలుగా వాహనాల పార్కింగ్
- దుకాణాల ఏర్పాటు.. పట్టించుకోని అధికారులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి చిరు వ్యాపారుల ఆక్రమణలతో నానాటికీ ఇరుగ్గా మారుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. చిరువ్యాపారుల ఆక్రమణలను తొలగించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారిపై వాహనాల రద్దీతో ఇబ్బందిగా మారింది. దీనికి తోడు చిరువ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. దీంతో రాకపోకలు, పాదచరులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. తరచూ చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బస్టాండ్ స్కూల్ నుంచి రాజీవ్ చౌరస్తా వరకు సమీపంలో కొన్నిసార్లు చిరువ్యాపారులు, వాటి ముందు కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌తో బస్సులు, పెద్ద వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరువ్యాపారులు రోజురోజుకూ రోడ్డుమీదికి వస్తున్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసుల, మున్సిపాలిటీ అధికారుల తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పండ్లు, టీకొట్లు, తోపుడుబండ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర చిరువ్యాపారాల దుకాండ్లు హైవేపేనే నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే కొందరు దుకాణాల యజమానులు షాపుల ముందు ఉన్న రోడ్లను ఆక్రమించి టీకొట్లు, జ్యూస్ బండ్లకు అద్దెకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అదేదో వారి సొంత స్థలమైనట్టు దబాయించి మరీ కిరాయి వసూలు చేసుకుంటున్నారు. చిరు వ్యాపారుల నుంచి రోజుకు ఇంత మొత్తంగా తీసుకుంటూ ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గిరాకీని బట్టి రోజుకు రూ.300 నుంచి 600వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేస్తున్న కిరాయితో వారి దుకాణాలకు అద్దె చెల్లిస్తున్నారు. చిరువ్యాపారుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ, మున్సిపల్ అధికారులు, సివిల్ పోలీసులు స్పందించి జాతీయ రహదారిపై చిరువ్యాపారుల ఆక్రమణలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

అంతారం అటవీప్రాంతంలో విచారణ

- క్షేత్రస్థాయిలో పర్యటించిన డీఎఫ్‌వో శ్రీనివాసరావు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం గ్రామ శివారులోని అటవీ క్షేత్రంలో అటవీ శాఖ ఫ్లైయింగ్ స్క్వాడ్, డీఎఫ్ఓ శ్రీనివాసరావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. అర్బన్ పార్కు నిర్మాణంలో విలువైన చెట్లను నరికేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు డీఎఫ్‌వోను విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయన తాండూరు రేంజ్ అధికారి సరస్వతి శ్రీదేవితో కలిసి అంతారం అటవీ క్షేత్రాన్ని సందర్శించి విచారణ జరిపారు. అర్బన్ పార్కు ఎంత దూరం వరకు నిర్మిస్తున్నారు? చైన్‌లింక్ ఫెన్సింగ్ ఎంత దూరంలో ఉందనే వివరాలను సేకరించారు. చైన్‌లింక్ ఫెన్సిలింగ్ 1.2 కిలోమీటర్ల వరకు నిర్మించాల్సి ఉండగా, 600 మీటర్ల మేర నిర్మించామని, నడక దారి 3 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉందని ఆమె వివరించారు. అయితే అవసరం ఉన్నచెట్లనే అత్యవసర పరిస్థితుల్లో తొలగించాల్సి వచ్చిందని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని వివరించారు. కొందరు కబ్జాలకు పాల్పడి అటవీ ప్రాంతాన్ని ఆక్రమించుకునే ప్రయత్నిస్తున్నారని, అట్టి భూమిని స్వాధీనం చేసుకుని అటవీ క్షేత్రంలోకి కలుపుకోవడంతో కొందరు కావాలనే



ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. అర్బన్ పార్కు వివరాలను సమగ్రమంగా సేకరించి వెళ్లినట్లు అటవీ శాఖ అధికారి తెలిపారు. వారి వెంట తాండూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్, బీట్ ఆఫీసర్ మల్లయ్య, తదితర సిబ్బంది ఉన్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నర్సింహులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరో రూపంలో తెలంగాణ రాజకీయాల్లోకి వస్తున్నారని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించడం అర్థరహితమని తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన షాద్‌నగర్ పట్టణంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ అసలు చంద్రబాబు అంటే కేసీఆర్‌కు అంత భయమెందుకని ప్రశ్నించారు. తన స్వార్థం కోసం ప్రాంతాల పేరిట వైషమ్యాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్న కేసీఆర్‌కు చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజన్ 20-20 ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే ప్రత్యేక రాష్ట్రం అంటూ తెలంగాణను సర్వ నాశనం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆనాడు తెలుగుదేశంతో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యునిగా టీడీపీ నేతలు గెలిపించిన విషయాన్ని కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధరణి పేరిట భూములను కొల్లగొట్టడంతోపాటు వేలాది మందికి భూములు లేకుండా చేశారని ఆరోపించారు. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి నేటికి గ్రామాల్లో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఏ విజన్ లేని వ్యక్తి కేసీఆర్ అని వ్యాఖ్యానించారు.

కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలి

చౌదరిగూడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు టెంట్ సౌకర్యంతోపాటు రెండు వందల రోజులు పని కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు డప్పు రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని ఉత్తరాస్‌పల్లిలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలకు షరతులు లేకుండా రోజువారీ వేతనంగా రూ.800 చెల్లించాలని డిమాండ్ చేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చౌదరిగూడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కొందుర్గు యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్కాగూకు చెందిన కుర్వరాధకు పీఎంఎఫ్ఎంఈ స్కీం రూ.2 లక్షలతో మంజూరైన పిండి గిర్ని, కారంపొడి మిషన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం నరసింహ, సీసీలు రమేశ్, దేవయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బందెయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వద్దు

చౌదరిగూడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కల పెంపకంపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని జిల్లేడ్, వీరన్నపేట్, పద్మారం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీ లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించాలంటే నరకాల్సిందేనా?

ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించని అధికారులు
గ్రంథాలయ నిర్మాణంలో తరాల నాటి చెట్లు కూల్చివేత
అనుమతులు లేకుండానే చెట్ల తొలగింపు


చేవెళ్లలో నిర్మిస్తున్న గ్రంథాలయ స్థలంలో చింతచెట్టును తొలగిస్తున్న కూలీలు

చేవెళ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని చెప్పె అధికారులే దగ్గరుండి మరీ నరికిస్తున్నారు. చెట్లను కాపాడాలని చెప్పాల్సిన అధికారులే నిర్మాణం కోసం వేసిన ప్లాన్ల మార్పుల కోసం భారీ చెట్లను ఎక్కడికక్కడ నరికివేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. తాతలు నాటి చెట్లను సైతం తొలగిస్తున్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో రూ.2 కోట్లతో చేపట్టిన నూతన గ్రంథాలయ భవన నిర్మాణ కొనసాగుతున్నాయి. అయితే గ్రంథాలయ భవనం స్థలంలో ఉన్న చెట్లను ఒక్కొక్కటిగా నరికివేస్తున్నారు. అదేమంటే భవన నిర్మాణానికి చెట్లు అడ్డు వస్తున్నాయంటున్నారు. ఇప్పటికే మూడు పెద్ద వేప చెట్లను అడ్డంగా నరికివేసి భవన నిర్మాణం కోసం పునాదులు తీశారు. అదే స్థలంలో వెనుకభాగంలో ఉన్న భారీ చింత చెట్టును అధికారులు శుక్రవారం కూలీలు, యంత్రం సహాయంతో తొలగించారు. భవన నిర్మాణానికి ఇచ్చిన ప్లాన్‌లో ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు మార్పులు, చేర్పులు చేశారు. దీంతో గ్రంథాలయానికి కేటాయించిన స్థలంలో ఉన్న భారీ చింత చెట్టును నరికివేశారు. భవన నిర్మాణానికి అడ్డులేకపోయినా నీడనిచ్చే చింతచెట్టును తొలగించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. చింత చెట్టును తొలగించాలంటే ముందస్తుగా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, అనుమతి తీసుకోకుండానే చింతచెట్టును కూల్చివేశారు. నరికిన చెట్ల మొద్దులు అనవాలు లేకుండా సిబ్బందితో ఆటోలో దూరంగా తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అక్కడే ఉన్న సైట్ ఇంజినీర్ శ్రీరాంను వివరణ కోరగా గ్రంథాలయ భవన నిర్మాణ స్థలంను చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సందర్శించి ఇటీవల కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. భారీ చింతచెట్టును తొలగించాలని సూచించడంతోనే తొలగిస్తున్నామని వివరణ ఇచ్చారు.


వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మిక్సింగ్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపాలిటీలోని కోత్వాల్‌గూడ పరిసరాల్లో నడుస్తున్న మిక్సింగ్ ప్లాంట్లను మండల రెవెన్యూ అధికారులు ఇటీవల సీజ్ చేశారని, అయితే ఆ ప్లాంట్లలో కొన్ని మళ్లీ నడుస్తున్నాయని సీపీఐ నాయకులు నర్రా గిరి, యాదగిరి శుక్రవారం రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. విచ్చలవిడిగా నడుస్తున్న మిక్సింగ్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్ నారాయణరెడ్డికి సీపీఐ ఫిర్యాదు చేసిందని, ఇటీవల ఆ ప్లాంట్లను సీజ్ చేశారని గుర్తు చేశారు. కొందరు మళ్లీ దొంగచాటుగా ప్లాంట్లను నడుపుతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

యాచారం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు సంబంధించి పంటల వివరాలను చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవినాథ్ ఒక ప్రకటనలో కోరారు. మార్చి 15 వరకు పంటల సాగును నమోదు చేసుకోవాలని సూచించారు. యాచారం, మొగ్గుళ్లవంపు, నందివనపర్తి, మల్కీజ్‌గూడ, అయ్యవారిగూడ, తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లి తండా రైతులు ఏఈవో సంతోష్‌కుమార్‌కు, గునగల్, గడ్డమల్లాయాగూడ, చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, చిన్నతూండ్ల గ్రామాల రైతులు ఏఈవో రాధమ్మకు, మేడిపల్లి, నక్కర్త, కొత్తపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, గ్రామాల రైతులు ఏఈవో రమేష్‌వద్ద, మాల్, నల్లవెల్లి, చింతపట్ల, మంతన్‌గౌడ్, మంతన్ గౌరెల్లి, తమ్మలోనిగూడ, గ్రామాల రైతులు ఏఈవో వసంత వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

తండాలో తాగునీటి సమస్యకు పరిష్కారం

కొత్తూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను తెలుసుకున్న ఓ నాయకుడు సొంత ఖర్చులతో బోరు వేయించి సమస్యను పరిష్కరించారు. నందిగామ మండల పరిధిలోని పెద్ద గుట్టతండాలో తాగు నీటి సమస్య నెలకొనడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల సదర్ కమిటీ అధ్యక్షుడు కేశమోని శ్రీనుయాదవ్ తండాలో శుక్రవారం బోరు వేయించాడు. దీంతో తండావాసులు హర్షం వ్యక్తం చేసి శ్రీనుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిమోని అంతయ్య, నర్సింహ్మా, లింగం, అగ్గి మహేష్, నరేష్, అస్లీ పాల్గొన్నారు.

రేపు క్రికెట్ పోటీలు

చేవెళ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలో 23న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నామని నిర్వాహకుడు పెద్దోళ్ల దయాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ పెద్దోళ్ల పర్మయ్య జ్ఞాపకర్థం పట్టణ కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభిస్తామని, రెండు మ్యాచ్‌ల చొప్పున పోటీలు నిర్వహించి విజేత జట్టుకు రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు అందిస్తామని తెలిపారు.

శివస్వాములకు పండ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములకు ఆమనగల్లులో విశ్వవిజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. బస్టాండ్ ఎదుట దొంతు విశ్వనాథం, విజయలక్ష్మి దంపతులు శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా శ్రీరామ దూత ఆశ్రమ వ్యవస్థాపకుడు శివానందస్వామి ప్రారంభించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండ్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివస్వాములు రేగటి శ్రీను, దొంతు పుల్లయ్య, శ్రీనివాసులు, సత్యనారాయణ, గార్లపాటి శ్రీను ఉన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


గెలిచిన జట్టుతో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి

చౌదరిగూడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. విజేతలకు స్థానిక నాయకులతో కలిసి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన క్రీడాకారులు నిరుత్సాహానికి గురికావొద్దన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కబడ్డీ పోటీల్లో ఓపెన్ విభాగంలో పండుగ సాయన్న టీంకు మొదటి బహుమతి, రన్నర్ టీం జ్యోతి క్లబ్ జట్లకు నగదు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, రవీందర్ రెడ్డి, బోయ శంకర్, సత్యం, విజయ్, చంద్రశేఖర్, రమేష్, ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు యాదగిరి, నరేందర్, మధు, లింగం, తేజ, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

ఆదిభట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరతూ ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లి, చింతపల్లిగూడ(3వార్డు) ప్రజలు ఎమ్మెల్యే రంగారెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 3వ వార్డు పరిధిలోని అండర్ డ్రైనేజీ, తాగునీటి సమస్యను పరిష్కరించి, ప్రభుత్వం చేపట్టిన పథకాలు అర్హులకు అందజేయాలన్నారు. చింతపల్లిగూడ నుంచి రాందాస్‌పల్లి మీదుగా బ్రాహ్మణపల్లి రోడ్డు వరకు బీటీ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆ శాఖలకు సంబంధించిన అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. చింతపల్లిగూడ నుంచి రాందాస్‌పల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్రం సుధాకర్‌రెడ్డి, ఉక్కుల అశోక్, జోగు శేఖర్, భిక్షపతి, నరసింహ, రాములు, స్వామి, కిరణ్ పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు

శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావ్


ఇన్ముల్‌నర్వలో దాడులు నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు, పోలీసులు

కొత్తూర్, ఫిబ్రవరి 21:(ఆంధ్రజ్యోతి) నిషేధిత పదార్థాలు విక్రయించే వారిపై ఉక్కుపాదం తప్పదని శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ, జేపీ దర్గా, ఐసోలేటెడ్ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఏసీపీ శ్రీనివాస్‌రావ్ ఆధ్వర్యంలో పోలీసులు పాన్‌షాప్‌లు, బెల్ట్‌షాపులపై ఆకస్మిక దాడులు చేశారు. కొత్తూర్ మండల కేంద్రంలో వాహనాలు, లాడ్జ్‌లు, ఫంక్షన్ హాళ్లను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులను ఆరా తీశారు. ఇన్ముల్‌నర్వ, జేపీ దర్గా వద్ద నాలుగు బెల్ట్‌షాపులు, రెండు పాన్‌షాప్‌లపై దాడులు నిర్వహించి దాదాపు రూ.40 వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. దాడుల్లో కొత్తూర్, నందిగామ ఇన్‌స్పెక్టర్లు నర్సింహారావు, ప్రసాద్, ఎస్ఐలు శ్రీనివాస్, మురళీగౌడ్, ఎస్ఓటీ ఎస్ఐ శ్రీకాంత్, శంషాబాద్ జోన్ షీటీం పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'అన్ని వర్గాలను మోసగించిన కాంగ్రెస్'


మాట్లాడుతున్న కంబాల అంజి, బీఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసగించిందని బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు కంబాల అంజి ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారానికి ఒడిగట్టారని మండిపడ్డారు. కడ్తాలలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆరు దశాబ్దాల కాలంలో చేయని అభివృద్ధిని పదేళ్లలో బీఆర్ఎస్ చేసి చూపిందని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా సరిగా అమలు కావడం లేదని, 15 నెలల కాలంలో ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. నాయకులు మహేశ్, శ్రీను, అంజినాయక్, కొప్పు కృష్ణ, రవి, అంజాద్, గోపాల్, ప్రశాంత్, శేఖర్, రాజు, ప్రేమ్‌కుమార్, సురేశ్, కృష్ణ, రాజు, మహేశ్, కిషన్ నాయక్, సక్రు నాయక్, శ్రీకాంత్, శ్రీశైలం, బాల్‌రాజ్, నవీన్, సాయి పాల్గొన్నారు.

పేదింటి వివాహానికి చేయూత

కడ్తాల్ , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డ పెళ్లి కి గిరిజన నేతలు చేయూతనందించారు. కడ్తాల మండలం కానుగుబావి తండాకు చెందిన రాజుఅనిత దంపతుల కుమార్తె ఝాన్సీ వివాహం శుక్రవారం జరిగింది. ఈనేపథ్యంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, సేవాలాల్ సేనా రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్‌పతి నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మూడావత్ రాజు రూ. 15 వేలు సమకూర్చి ఝాన్సీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపినాయక్, హర్యానాయక్, బీచ్య, శ్రీను, మాన్యనాయక్, పాల్గొన్నారు.

కానుగుబావి తండాలో..

కడ్తాల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానుగుబావి తండాకు చెందిన నేనావత్ రాజు కూతురు ఝాన్సీ వివాహానికి బీఆర్ఎస్ నాయకులు సమకూర్చిన రూ.50 వేలు ఆర్థికసాయాన్ని కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థికసాయం సమకూర్చిన బీఆర్ఎస్ నాయకులను దశరథ్‌నాయక్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్‌నాయక్, నాయకులు సేవ్యనాయక్, పాండు, కృష్ణ, శంకర్, అంజి, సక్రు, భాస్కర్, శ్రీను, చందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కేసులు

చేవెళ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ హెచ్చరించారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. చేవెళ్ల సీఐ వెంకటేశం, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

హార్స్ రైడింగ్‌కు రెడీ

(5వ పేజీ తరువాయి)


పోలో హార్స్ గ్రౌండ్

1988లో క్లబ్‌ను ఏర్పాటు చేశారు. క్లబ్‌లో నిష్ణాతులైన శిక్షకులతో సుమారు 40 గుర్రాలను పెంచుతున్నారు. అయితే మీర్ అహ్మద్ పోలో కోసం ప్రత్యేకంగా సిలికా ఎరినా (మైదానం)ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దారు. రాత్రి సమయాలలోనూ శిక్షణ పొందేందుకు ఫ్లడ్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఇలాంటివి తెలుగు రాష్ట్రాల్లో ఆరు క్లబ్‌లు ఉండగా రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని క్లబ్ ఒకటి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హార్స్ రైడింగ్ క్లబ్‌ను నిర్మించి పిల్లలకు శిక్షణ ఇచ్చి పోటీలకు పంపాలన్న ఉద్దేశంతో ఆయన ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశారు.

సొంత గుర్రాలు లేని వారికి అద్దెకు....

జాతీయ అర్హతా పోటీలలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున హార్స్ రైడర్లు పాల్గొనే అవకాశం ఉంది. సొంత గుర్రాలు లేనివారికి నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో గుర్రాలను అద్దెకు ఇస్తారు. రోజుకు రూ.1000 అద్దె తీసుకుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రైడర్ల గుర్రాలను ఉంచేందుకు స్టేబుల్ అనే పేరుతో స్థలాన్ని ఎంపిక చేశారు.

మహిళల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి


సత్తు కవితకు నియామకపత్రాన్ని అందజేస్తున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు, రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట వేసిందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో మహిళా నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆకులమైలారం గ్రామానికి చెందిన సత్తు కవితారెడ్డిని మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. తమ పార్టీ నియోజకవర్గం అధ్యక్షురాలు కందుల సమంత ఆదేశాల మేరకు కవితను నియమించినట్లు పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీలు జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, అందుగుల సత్యనారాయణ, పాండురంగారెడ్డి, మహేందర్, బమాబురావు, గణేష్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

మండల ఏర్పాటుపై కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం 112వ రోజుకు చేరాయి. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు ఆంజనేయులు గౌడ్, శరత్‌చంద్ర, కార్యదర్శి అనిల్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

షాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.50 అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవరామ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులు, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంటారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, సర్దార్‌నగ్ ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

షాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ పశు వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్‌లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 26 ఆవులకు చూడు పరీక్షలు, 12 పశువులకు గర్భకోశ వ్యాదుల నివారణ పరీక్షలు చేశారు. 30 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయించాలన్నారు.

సేంద్రియ ఎరువులతో నేల సారం

యాచారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పంటలకు సోకే చీడపీడల నివారణకు రసాయన మందులకు బదులు సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుమతులు సాధించాలని కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం యాచారం మండలంలోని చౌదర్‌పల్లిలో డ్రోన్ల సాయంతో పంటలకు ఎరువులు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. డ్రోన్లతో ఎరువులు చల్లితే సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. అధికంగా ఎరువులు వాడితే నేల గట్టిపడి పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు.

వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ


హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్ రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను వదిలి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. యాచారం సమీపంలోని సోషల్ వెల్ఫేర్ గురుకులాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలలో కూరగాయలను పరిశీలించారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ ఇస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో రెండు గంటల పాటు మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు.

క్రైం కార్నర్

వృద్ధురాలిపై అత్యాచారయత్నం!

యాచారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గత డిసెంబర్ 9న రాత్రి 70 ఏళ్ల యాచకురాలు రోడ్డు వెంట ఒంటరిగా నడచుకుంటూ వెళ్తుంది. ఆ సమయంలో ఓ కామాంధుడు ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బయటకు రాకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారమందడంతో పోలీసులు బ్యాంక్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా ఓ వ్యక్తిని రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. స్పెషల్ బ్రాంచి పోలీసులతో విచారణ చేయించినట్లు సమాచారం. రెండు నెలల క్రితం ఘటన జరిగితే కేసు నమోదు చేయడంలో జాప్యం కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. దీనిపై స్థానిక పోలీస్ అధికారులపై చర్యలు తీసుకుంటారని సమాచారం. అయితే అదే రోజు పెట్రోమొబైల్ పోలీసులు అధికారులకు వివరిస్తే ఆమెకు మతిస్థిమితం లేదని, వదలిపెట్టాలని సూచించినట్లు స్థానికులు అంటున్నారు. ఆమెపై అత్యాచారం జరిగినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. బాధితురాలికి చికిత్స చేయించి నల్లవెల్లితండాకు పంపించామని సీఐ నర్సింహరావు తెలిపారు. నిందితుడిని శనివారం రిమాండ్‌కు పంపిస్తామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆంధ్రజ్యోతితో చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

కొత్తూర్, ఫిబ్రవరి 21:(ఆంధ్రజ్యోతి) కొత్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద గల హెచ్ఐఎల్ పరిశ్రమ ఆవరణలో అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. తమిళనాడు కోయంబత్తూర్ ప్రాంతానికి చెందిన సుబ్రమణ్యం(55) తోటి డ్రైవర్ దురాయిరాజ్‌తో కలిసి లోడింగ్ కోసం హెచ్ఐఎల్ పరిశ్రమకు గురువారం వచ్చాడు. పరిశ్రమలోని పైప్ స్టోరేజీ ప్రహరీ పక్కన సుబ్రమణ్యం మృతి చెంది ఉన్నట్లు తోటి డ్రైవర్ శుక్రవారం ఉదయం పరిశ్రమ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. సుబ్రమణ్యం బహిర్భూమికి వెళ్తూ కిందపడిపోయి చనిపోయి ఉండవచ్చని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కేశంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదానికి గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన చెవిటి ప్రవీణ్(28) జీటీపీఎల్ ఇంటర్‌నెట్ కెబుల్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 13న కేశంపేట మండల కేంద్రంలోని అల్వాల రోడ్డులో పాటిగడ్డ సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ప్రవీణ్ తండ్రి చెవిటి జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఆమనగల్లు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో రొయ్యల లక్ష్మమ్మ నివాసంలో చోటు చేసుకున్న బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రాకారం.. గాంధీనగర్ కాలనీకి చెందిన లక్ష్మమ్మ ఇంట్లో జనవరి 30న గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. అల్మారాను పగులగొట్టి 9.2 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆదేశానుసారం పోలీసులు స్పెషల్ టీంను ఏర్పాటు చేశారు. అనుమానితుడైన ఆమనగల్లు పట్టణానికి చెందిన నేనావత్ చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

తప్పిపోయిన విద్యార్థిని ఆచూకీ లభ్యం

ఆదిభట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య కళాశాల నుంచి తప్పిపోయిన విద్యార్థిని ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొంగ్లూర్ సమీపంలోని శ్రీచైతన్య కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఈ నెల 16న తల్లిదండ్రులు వచ్చి చూసి వెళ్లారు. తర్వాత విద్యార్థిని ఎవరికి చెప్పకుండా హాస్టల్ నుంచి అదేరోజు బయటకు వెళ్లింది. సాయంత్రం హాజరు తీసుకున్న అధ్యాపకులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. తప్పిపోయిన బాలిక బంధువైన బాబాయి ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి విద్యార్థినిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై శనివారం రాత్రి బాలికతోపాటు ఆమె తల్లిదండ్రులు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలానగర్ మండలానికి చెందిన బాలికను మాయమాటలు చెప్పి చౌదరిగూడ మండలానికి చెందిన యువకుడు మోసం చేశాడు. ప్రస్తుతం అమ్మాయి గర్భవతి అని సమాచారం. కొందరు పెద్దలు యువకుడికి నచ్చజెప్పి పెళ్లి చేసుకోవాలని సూచించినా అందుకు అతడు నిరాకరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఏసీపీ రంగస్వామిని వివరణ కోరగా ఫిర్యాదు అందినట్లు తెలిపారు. విచారణ చేస్తామని పేర్కొన్నారు.

మద్దెలకుంట తండాలో యువతి అదృశ్యం

కడ్తాల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దెలకుంట తండాకు చెందిన నున్సవత్ సరళ(30) అదృశ్యమైంది. ఈ మేరకు శుక్రవం ఆమె తల్లి నిలా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 16న ఆస్పత్రిలో చూపించుకుంటానని వెళ్లిన సరళ తిరిగిరాలేదని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు

కేంద్ర స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక


చందన


సరయూ


ఆదిత్య

కేశంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనానికి(ఎన్ఎంఎంఎస్) కేశంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో తొమ్మిదో తరగతి నుంచి ఏటా రూ.12,000 స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నవంబర్‌లో ఎంపిక పరీక్ష నిర్వహిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్‌ను ఏటా బ్యాంకు అకౌంట్‌లో వేస్తారని పాఠశాల జీహెచ్ఎం విద్యావతి తెలిపారు. ఇటీవల విడుదలైన ఎంపిక జాబితాలో కేశంపేట స్కూల్ విద్యార్థులు చందన, సరయూ, ఆదిత్య ఉన్నారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.